క్లుప్తంగా

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన

ప్రొద్దుటూరు : రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్నట్లు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు కానపల్లెలో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తారని, అనంతరం మండి మార్కెట్ సమీపంలోని కాంప్లెక్స్‌లో అభినందన సభకు హాజరవుతారన్నారు. సాయంత్రం స్వరూప్ కంటి ఆస్పత్రిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తారని, సాయంత్రం వేంకటేశ్వర డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలో పాల్గొంటారని ఆయన వివరించారు.

నేడు జెడ్పీ చైర్మన్ బ్ర.మఠం రాక

బ్రహ్మంగారిమఠం : జిల్లాపరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు మొదటి సారి బ్రహ్మంగారిమఠంకు వస్తున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపాడు. జెడ్పీ చైర్మన్ హోదాలో మొదటి సారి రావడంతో మండలంలోని వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు.

బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం ఎన్నిక

మైదుకూరు : స్థానిక కోర్టులో అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025–26 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ ఎన్నికలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సోమేసుల శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల వెంకటశివరామ్, సహాయ కార్యదర్శిగా చిలుంగారి కృష్ణమూర్తి, మహిళ కార్యదర్శిగా షేక్ తహసీన్ బాను ఏక్రగీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు సీనియర్ న్యాయవాదులు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామిశెట్టి శ్రీనివాసులు, ఏజీపీ జ్వాలా నరసింహ శర్మ, కామనూరు శ్రీనివాసులు, పీవీ నారాయణరెడ్డి, మూలే నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని వెలవలి గ్రామస్థులకు ఎస్ఐ మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా మొబైల్‌కు లింక్‌లు పంపి ఓటీపీ చెప్పమని అడిగితే ఎవరికి చెప్పవద్దన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని గొడవలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ పల్లె చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు పల్లె రఘురాంరెడ్డి, కుమారులు మౌని వర్ధన్‌రెడ్డి, అఖిల్ కుమార్ రెడ్డిల నిత్యావసర సరుకులు అందించారన్నారు. ప్రతి ఏటా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జ్యోతి, సుబ్బరాయుడు, ఆసిఫ్, భద్రుడు, రహమతుల్లా, రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయకుంటే భూ పోరాటాలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి న్యాయం చేయకుంటే భూపోరాటాలకు సిద్ధమవుతామని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజులు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే అనేక పర్యాయాలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రెవెన్యూ అధికారులు అర్హులను గుర్తించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అధికారులు స్పందించి ఈ నెల 10వ తేదీలోపు ఇంటి స్థలాలు కేటాయించకపోతే 14న అర్హులతో కలిసి భూపోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని 75 పరీక్షా కేంద్రాల్లో 12431 మంది, మండలంలోని 23 పరీక్షా కేంద్రాల్లో 3,758 మంది హాజరయ్యారు. ఉప విద్యాశాఖాధికారి యు.మీనాక్షి చివరిరోజున తనిఖీలు నిర్వహించారు.

‘పది’ పరీక్ష అయిపోయిందోచ్..!

ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా బయటకు వచ్చారు. ఇన్నాళ్లు కష్టపడి చదివిన విద్యార్థులు... పరీక్షలు అయిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షలు బాగా రాశామని, అధిక మార్కులతో పాసవుతామని వారి ఉపాధ్యాయులతో చెబుతున్నారు. అనంతరం పరీక్ష కేంద్రం వద్దే కాసేపు తమ మిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. పరీక్ష ఎలా రాశావని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ ఎక్కడ చేరేది, ఏ గ్రూపు తీసుకునేది, ఎండాకాలం సెలవుల్లో కోచింగ్ తీసుకుందామా అనే విషయాలు మాట్లాడుకున్నారు. ఇక విడిపోతున్నామంటూ ఇదే చివరి కలయిక అని చెప్పుకుంటూ మరి ఎప్పుడు కలుస్తామోనని బాధతో టాటా... బాయ్ బాయ్ చెప్పుకుంటూ వెళ్లారు. వేసవి సెలవులను వృథా చేయకుండా కోటి ఆశయాలతో భవిష్యత్తు బాటలోకి అడుగులు వేస్తామని, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని వారు చెబుతున్నారు. రాజుపాళెం మండలంలోని 8 జెడ్పీ ఉన్నత, మూడు ప్రైవేటు, వెల్లాలలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులంతా రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ,బీ అనే రెండు సెంటర్లలో మొత్తం 252 మంది పరీక్షలు రాశారు.

– రాజుపాళెం



పది పరీక్షలు రాసి బయట చర్చించుకుంటున్న విద్యార్థినులు



సమాధానం రాశానంటున్న విద్యార్థిని



విద్యార్థికి తినుబండారాలు ఇస్తున్న తండ్రి



సరదాగా గడుపుతున్న విద్యార్థులు



ఉపాధ్యాయుడితో చర్చిస్తున్న విద్యార్థినులు

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో మైసూరమ్మతల్లి తిరుణాల సందర్భంగా న్యూ కేటగిరీ వృషభ రాజములకు మంగళవారం బండలాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. తొమ్మిది జతల ఎద్దు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి ఎద్దులు 3,500 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలవగా.. దాత నాగేళ్ల చిన్న అంకిరెడ్డి యజమానికి రూ.60వేలు అందజేశారు. బాపట్ల జిల్లా ఉప్పమాగులకు చెందిన రవిచంద్రారెడ్డి ఎద్దు 3,426 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ స్థానంలో నిలవగా వాటి యజమానికి రూ.40వేలు దాత సుధా శివమోహన్‌రెడ్డి, మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి అందించారు. ప్రకాశం జిల్లా పాట్టిపాడుకు చెందిన గొల్లపల్లి రామ్ చరణ్, బయపురెడ్డికి చెందిన ఎద్దులు 3,210 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలవగా వాటి యజమానులకు రూ.30వేలు దాత శివకృష్ణ యాదవ్ అందజేశారు. కడప జిల్లా పొత్తురెడ్డిపల్లె మదన్‌మోహన్ రెడ్డి ఎద్దు నాలుగో స్థానంలో నిలవగా వాటి యజమానికి రూ.20 వేలు దాత మంచిదేవర సుబ్బయ్య, కడప జిల్లా నాగాయపల్లెకు చెందిన రాజేశ్వరి, మేమారెడ్డి ఎద్దుల యజమానికి ఐదో బహుమతి దాత సిగినేని భాస్కర్‌రెడ్డి రూ.10వేలు అందుకున్నారు. మిగిలిన ఎడ్ల యజమానులకు కన్సోలేషన్ బహుమతుల కింద రూ.5వేలు దాత నాగేళ్ల శివానందరెడ్డి అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్తు కార్మికులకు బకాయిలు విడుదల చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : విద్యుత్తు కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కోలో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులకు 2022 పీఆర్సీ అరియర్స్ ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. 2019 నుండి 2024 వరకు కొత్తగా విధుల్లో చేరిన ఆపరేటర్లకు, పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. సబ్ స్టేషన్లలో నైట్ వాచ్‌మెన్లను నియమించాలన్నారు. ఈ నెల 7న తిరుపతి ఎస్‌పీడీసీఎల్ వద్ద ఈ ప్రధానమైన డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో జిల్లాలోని విద్యుత్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాలసుబ్బయ్య, లక్ష్మినారాయణ, ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పీవీ రమణ, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఎల్ఎంలు చిన్నరాయుడు, పోలయ్య, జేఎల్ఎంలు శివారెడ్డి, కుళాయప్ప, విజయ్‌కుమార్, రాఘవ, ప్రసాద్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆప్కాస్ సంస్థను రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ సంఘం మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ సంస్థ ఏర్పాటు కాకముందు ప్రతి సెక్షన్‌లో దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీతభత్యాల చెల్లింపులు సైతం దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని, ప్రతి నెల జీతాలు చెల్లించేవారు కాదని అన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆప్కాస్ వ్యవస్థ వీటన్నింటికి స్వస్తిపలికి కార్మికులకు సకాలంలో జీతాలు అందేవన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయనున్నట్లు ప్రకటించడం ద్వారా పొరుగు సేవల కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. తొలుత పాత మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిన్ని, మస్తాన్ షరీఫ్, యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, దేవమ్మ, కార్యదర్శులు సత్యరాజు, ప్రవీణ్‌కుమార్, కోశాధికారి శివకుమార్, డీవైఎఫ్ఐ నాయకులు ఓబుల్‌రెడ్డి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

పోరుమామిళ్ల : ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పోరాటాలతోనే పరిష్కరించుకుందామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) ఆధ్వర్యంలో కలెక్టరేట్ దగ్గర బుధవారం (నేడు) చేపడుతున్న నిరసన జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పిలుపిచ్చారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో మంగళవారం రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి సరిగా లేదన్నారు. ఓపీఎస్ అమలు తప్ప ప్రత్యామ్నాయాన్ని అంగీకరించమన్నారు. 12వ పీఆర్సీ గడువు సమీపించి రెండు సంవత్సరాలవుతోందని వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుతో పాటు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, హైస్కూల్ ప్లస్ కొనసాగించాలని రఘునాథరెడ్డి కోరారు. సమస్యల పరిష్కారానికి కడప కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన ప్రదర్శనకు ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, సీనియర్ నాయకులు చంద్రహాసరెడ్డి, సుకుమార్, బాలరాజు, శ్రీనివాసులు, పుల్లయ్య, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోజు మార్చి రోజు నీటి సరఫరా

ప్రొద్దుటూరు : పైపులైన్ లీకేజీ మరమ్మతుల సమస్య ఉండడంతో ఈ నెల 3వతేదీ నుంచి 5వ తేదీ వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రోజు మార్చి రోజు నీటి సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే స్టేషన్ వద్ద మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 900 ఎంఎం డయా పంపింగ్ లైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు మరమ్మతు పనులు చేపడుతుండడంతో రోజు మార్చి రోజు నీరు అందిస్తామన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

అర్జీలను అటకెక్కించారు!

- స్వీకరణకే పరిమితమైన అధికారులు
- ఉన్నతాధికారుల చేతుల్లోనే పరిష్కారమంటూ రెవెన్యూ సిబ్బంది సమాధానాలు
- అవస్థలు పడుతున్న అర్జీదారులు



రంపాడు రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్ (ఫైల్)

కాశినాయన : ప్రజల వద్దకే ప్రభుత్వం.. అక్కడే సమస్యలకు పరిష్కారం అనే నినాదంతో కూటమి సర్కారు ఆర్భాటంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలకు అతీగతీ లేకుండా పోయింది. సదస్సుకు హాజరై వినతులు సమర్పిస్తే తమ బాధలు తీరుతాయనే తలంపుతో మండల ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. సదస్సుల్లో అవి వెంటనే పరిష్కారమవుతాయని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాశలుగానే మారిపోతున్నాయి. అర్జీలు స్వీకరించిన అధికారులు ఎప్పుడు పరిష్కరిస్తారు? ఎవరు పరిష్కరిస్తారు? ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారు అనే అంశాలపై రెవెన్యూ సదస్సుల్లో స్పష్టత ఇవ్వలేదు. రెవెన్యూ సమస్యలు అధిక శాతం జాయింట్ కలెక్టర్ పరిష్కారం చూపాలని క్షేత్రస్థాయి అధికారులు చెబుతుండటంతో గందరగోళం నెలకొంది.

వినతుల వెల్లువ

మండల వ్యాప్తంగా 2024 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో 819 మంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అర్జీని పరిష్కరించిన దాఖలాలు లేవు. వచ్చిన అర్జీల్లో సింహభాగం భూ వివాదాలు పరిష్కరించాలని, తమకు భూమి కేటాయించాలని ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అధిక శాతం ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో పేరు మార్పు, అసైన్డ్ భూమి తండ్రి పేరు మీద ఉండి తండ్రి చనిపోతే భార్య పేరు మీద మార్చాలని ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో సమస్యలు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సంబంధిత అర్జీదారునికి మీ సమస్యను పరిష్కరించామని సెల్‌నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. అయితే ఆ మెసేజ్ తీసుకుని తహసీల్దారు కార్యాలయానికి వెళితే త్వరలో పరిష్కరిస్తామని సమాధానం చెబుతున్నారు. విజయవాడ నుంచి మెసేజ్‌లు వస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకపోయినా మెసేజ్‌లు పంపుతున్నారని అర్జీదారులు వాపోతున్నారు. మరోవైపు ఈ సమస్యలకు పరిష్కారం చూపడం తహసీల్దారు పరిధిలో కూడా లేదు. ఇటువంటి సమస్యలు జేసీ పరిధిలోనే పరిష్కారమవుతాయని, జేసీకి ఫైల్ పెట్టి పరిష్కరించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు మేము ఏమీ చేయలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గ్రామంలోనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడేమో ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చేంత వరకు మా చేతుల్లో ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. జాయింట్ కలెక్టర్ చేతిలో అధికారాలు ఉండటంతో తహసీల్దారు కార్యాలయాలకు ప్రాధాన్యం తగ్గిపోతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతుంది. ఎప్పుడో రిజిస్ట్రేషన్లు అయిన భూములు సైతం ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ప్రజలు కాళ్లరిగేలా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు చూపలేక రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. ఈ మాత్రం దానికి సదస్సులు పెట్టడం దేనికని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయం..నిరుపయోగం



అపరిశుభ్రంగా మారిన మునుపటి రాచాయపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. గ్రామ సచివాలయాలు ఏర్పాటుకు ముందు ఇదే కార్యాలయం నుంచి సర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయతీ అధికారులు విధులు నిర్వర్తించేవారు. గ్రామ సచివాలయానికి పక్కా భవనాలు నిర్మించడంతో అక్కడ నుంచే పరిపాలన కొనసాగుతోంది. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మునుపటి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమేనా శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ ఆవరణమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గ్రామంలో ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బాగు చేసి అంగన్‌వాడీ కేంద్రంగా అయినా మార్చాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ, మండల అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

వ్యక్తిపై కేసు నమోదు

కాశినాయన : మండలంలోని కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన శీలంవెంకటరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కె.ఎస్.కొట్టాల గ్రామానికి చెందిన మరియరాణి, చిన్నయ్యలకు చెందిన పశువులు వెంకటరెడ్డి పొలంలోకి వెళ్లాయన్నారు. ప్రతిరోజు పొలంలోకి పశువులను ఎందుకు తోలుతారని ఆవేశంతో వారిపై వెంకటరెడ్డి దాడి చేశారన్నారు. మరియరాణి, చిన్నయ్యల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదవీ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం

గోపవరం : మండలంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, ప్రభాకర్‌రాజులను మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖాధికారులు చెన్నయ్య, రఘురాములు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఇరువురు ఉపాధ్యాయులు పనిచేసిన పాఠశాలలు ప్రస్తుతం జిల్లాలోనే ఉత్తమ పాఠశాలలుగా ఉన్నాయని, వీరు విద్యను అందించిన ఎంతో మంది విద్యార్థులు ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు. పి.పి.కుంట ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా, సుందరయ్యకాలనీలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చెందాయని, అందుకు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిశంకర్, ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోవిందు, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు, టీచర్లు